సాక్షి
జగిత్యాల
గురువారం । 2 । నవంబర్ । 2023



ప్రజలే వేర్లు.. ప్రభుత్వమే ఫలం. వేర్లు సరిగా పనిని నిర్వర్తిస్తేనే ఫలం తియ్యగా ఉంటుంది.
– మహాత్మాగాంధీ

మీకు తెలుసా...?

## గద్దెల్లేవ్.. జెండాలు ఎగురవ్

జూలపల్లి(పెద్దపల్లి): హుస్సేన్‌మియావాగు నీటి గలగలలు.. ఎటుచూసినా పచ్చని పంట పొలాలు.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన బౌద్ధ స్థూపం ఉన్న ఊరు.. పురావస్తు శాఖలో నమోదైన మారుమూల పల్లె.. అదే పెద్దపల్లి జిల్లాలోని వడ్కాపూర్ గ్రామం. 2000 సంవత్సరం వరకు నక్సల్స్ ఆధిపత్యంలో ఉండేది. అయినా, 1999లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆ గ్రామానికి చేరుకున్నారు. బురద రోడ్లు చూశారు. అన్ని వీధుల్లోనూ సీసీ రోడ్లు, లక్షల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్ నిర్మించారు. అంతేకాదు.. పోలీసు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన ఇదే గ్రామస్తుడు వడ్కాపూర్ చంద్రమౌళి తను చదువుకుని, నిర్మించిన వేదికపైనే చంద్రబాబు గ్రామసభ నిర్వహించారు. ఇక్కడి మరో నక్సల్ నేత పుల్లూరి ప్రసాదరావు ఇప్పటికీ అజ్ఞాతంలోనే ఉన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఉన్నా.. ఆ పార్టీల గద్దెలు నిర్మించలేదు. పార్టీల జెండాలు ఎగురనూ లేవు.



వడ్కాపూర్ గ్రామం

### న్యూస్‌రీల్

## నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించండి



మాట్లాడుతున్న మామిడి నారాయణరెడ్డి

మల్లాపూర్: మండలంలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో చెరుకు రైతులతో కలిసి మాట్లాడారు. అధికారంలోకొస్తే 100 రోజుల్లోనే ఫ్యాక్టరీని తెరిపిస్తామన్న రాష్ట్రప్రభుత్వం.. రైతుల కోసం అవసరమైతే సొంత డబ్బు వెచ్చించి ఫ్యాక్టరీని నడుపుతానన్న బీజేపీ ఎంపీ అర్వింద్ వాగ్దానం విస్మరించడం దారుణమని అన్నారు. ఈనెల 3న ఎన్నికల ప్రచారం కోసం కోరుట్ల వస్తున్న కేసీఆర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై ప్రకటన చేయాలని, లేకుంటే కోరుట్ల అసెంబ్లీ స్థానానికి చెరుకు రైతులు భారీ సంఖ్యలో నామినేషన్లు వేసి ప్రజల వద్దకు వెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో కంది బుచ్చిరెడ్డి, గురిజెల రాజరెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, న్యావనంది లింబారెడ్డి, రైతులు నర్సారెడ్డి, రాజం, లక్ష్మారెడ్డి, మోహన్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, తుక్కారెడ్డి పాల్గొన్నారు.

## అడ్వకేట్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ కార్యవర్గం

జగిత్యాలజోన్: జిల్లా అడ్వకేట్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వడ్లకొండ మహేందర్, ప్రధాన కార్యదర్శిగా అల్లె పురుషోత్తం, సంయుక్త కార్యదర్శిగా ఈరుపాటి మహేందర్, ఉపాధ్యక్షుడిగా రాగం రమేశ్, నిర్వహణ కార్యదర్శిగా తీట్ల అరుణ్, కోశాధికారిగా గణేశ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కొలిపాక కరుణాకర్, గుగ్గిళ్ల రాజేందర్, బూస విశ్వదత్తు, దూలూరి సాయి, మధు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నక్కల సంజీవరెడ్డి తెలిపారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, పేదలకు సమన్యాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## హేమాహేమీల పురిటి గడ్డ

# కోరుట్ల..

జంగ్ తెలంగాణ

గలగలపారే గోదావరి.. నలుమూలలా ఎస్సారెస్పీ పరీవాహక ప్రాంతం.. ఎటు చూసినా పచ్చని పొలాలు. చెమట చిందిస్తూ కనిపించే రైతన్నలు.. మరోవైపు కన్నీటితో నిండిన గల్ఫ్ వలసలు.. అలుపుసొలుపు లేని బీడీ కార్మికుల క్షేత్రం కోరుట్ల. పునర్విభజనకు ముందు మెట్‌పల్లి, బుగ్గారంలో అంతర్భాగమైన ఈ సెగ్మెంట్ నుంచి హేమాహేమీలను అందించింది.





- బుగ్గారం.. మెట్‌పల్లి కలయిక
- పసుపు..చెరుకు రైతుల ఉద్యమ వేదిక
- బీడీ కార్మికులు.. గల్ఫ్ వలసలు
- పునర్విభజన నుంచీ బీఆర్‌ఎస్‌దే పాగా

కోరుట్ల: 1957లో ఏర్పాటైన బుగ్గారం, మెట్‌పల్లి నియోజకవర్గాల కలయిక నుంచి 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కోరుట్లగా ఆవిర్భవించింది. బుగ్గారంలోని కోరుట్ల, మల్లాపూర్ మండలాల నుంచి ఏడు గ్రామాలు, మెట్‌పల్లిలోని మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలాలతోపాటు మల్లాపూర్‌లోని మిగిలిన గ్రామాలను కలిపి నియోజకవర్గంగా ఏర్పడింది. జిల్లాలోనే రెండు మున్సిపాల్టీలు..రెండు రెవెన్యూ డివిజన్లు ఉన్న ఏకైక సెగ్మెంట్ కోరుట్ల కావడం గమనార్హం.

**రైతు ఉద్యమ వేదిక**

మల్లాపూర్ మండలం ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ మూసివేత, ఇక్కడ ఎక్కువగా సాగయ్యే పసుపు పంట మద్దతు ధర అంశాలు మూడుసార్లు జరిగిన ఎన్నికల్లో కీలక అంశాలుగా మారాయి. ఒక్కో సందర్భంలో షుగర్ ఫ్యాక్టరీ తెరిపించడానికి, పసుపు మద్దతు ధర కల్పించడానికి రైతులు చేసిన ఉద్యమాలతో కోరుట్ల సెగ్మెంట్ రణక్షేత్రంగా మారింది.

**గల్ఫ్ వలసలు..బీడీ కార్మికులు**

చక్కని నీటి పారకం.. భూగర్భజలాలు ఉన్నా.. పాతికేళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ముంబయి, గల్ఫ్‌దేశాలకు వెళ్తున్నారు. ఇప్పటికీ సుమారు 25వేల మంది గల్ఫ్‌లో ఉన్నారు. జీవనభృతి పొందుతున్న వారు ఇక్కడ 33వేల వరకు ఉన్నారు.

**హేమాహేమీలకు పుట్టినిల్లు..**

పునర్విభజనకు ముందు ఉన్న మెట్‌పల్లి సెగ్మెంట్ సీహెచ్.విద్యాసాగర్‌రావుకు రాజకీయ పురిటి గడ్డగా నిలిచింది. 1985లో మొదటిసారి మెట్‌పల్లి ఎమ్మెల్యేగా గెలిచి తర్వాత హ్యాట్రిక్ సాధించారు. కరీంనగర్ ఎంపీగా, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా, మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నత పదవులు అలంకరించారు. 1998 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి కొమిరెడ్డి రామ్‌లు భార్య కొమిరెడ్డి జ్యోతి ఎమ్మెల్యేగా గెలిచారు. జనతా పార్టీ నుంచి 2004లో కొమిరెడ్డి రామ్‌లు గెలుపొందారు. ఇక బుగ్గారం నియోజకవర్గం 1957 నుంచి 1978 వరకు ఓసీలకు పట్టం కట్టింది. బీసీవర్గానికి చెందిన అంబల్ల రాజారాంకు 1978లో, కడకుంట్ల గంగారాంకు 1983లో, అలాగే 1985, 1994 అసెంబ్లీ ఎన్నికల్లో శికారి విశ్వనాథంకు పట్టంగట్టింది. 2004లో గెలిచిన జువ్వాడి రత్నాకర్‌రావు దేవాదాయ, స్టాంప్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా వ్యవహరించారు.

**నాలుగు సార్లు ఏకపక్షం..**

2009లో ఆవిర్భవించిన కోరుట్లకు 2009, 2010, 2014, 2018 ఎన్నికలు జరిగాయి. ఇందులో వరుసగా నాలుగుసార్లు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఎమ్మెల్యేగా గెలుపొంది తన ఓటింగ్ శాతాన్ని 32 నుంచి 51 శాతానికి పెంచుకున్నారు. ఈయన హయాంలోనే కోరుట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్లుగా అవతరించాయి. సుమారు 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా కొనసాగిన విద్యాసాగర్‌రావు ఈసారి వయోభారంతో పోటీ నుంచి తప్పుకొని తన కుమారుడు కల్వకుంట్ల సంజయ్‌ని రంగంలోకి దించారు.



విద్యాసాగర్‌రావు　రత్నాకర్‌రావు　విద్యాసాగర్‌రావు
అర్వింద్　నర్సింగరావు　సంజయ్

| ఓటర్ల వివరాలు | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 2,27,521 |
| మహిళలు | 1,18,436 |
| పురుషులు | 1,09,083 |
| ఇతరులు | ఇద్దరు |

### కోరుట్ల పోటీ రసవత్తరం

- ఈసారి విద్యాసాగర్‌రావు తనయుడు సంజయ్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.కాంగ్రెస్ అభ్యర్థిగా జువ్వాడి నర్సింగరావు బరిలో దిగుతున్నారు. బీజేపీ నుంచి అనుహ్యంగా నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఇక్కడి నుంచి బరిలో ఉంటున్నారు. బీఎస్పీ నుంచి యువకుడు నిశాంత్ కార్తికేయ పోటీ చేస్తున్నారు. కోరుట్ల సెగ్మెంట్‌లో పద్మశాలీ ఓటర్లు, ముస్లిం మైనార్టీలు, ఎస్సీ ఓటర్లు ప్రభావితవర్గాలుగా చెప్పవచ్చు.

# నేడు ధర్మపురికి సీఎం కేసీఆర్



ధర్మపురిలో సీఎం పాల్గొనే బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, నాయకులు

- మధ్యాహ్నం రెండు గంటలకు బహిరంగ సభ
- ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా ఎన్నికల ప్రచారం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: ప్రజా ఆశీర్వాద సభ యాత్రలో భాగంగా సీఎం కల్వకుంట చంద్రశేఖర్‌రావు గురువారం ధర్మపురి నియోజకవర్గకేంద్రానికి రానున్నారు. ఇందుకోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం కేసీఆర్ మధ్యాహ్నం రెండు గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుండి ప్రత్యేక వాహనంలో నేరుగా జూనియర్ కళాశాల వేదిక వద్దకు చేరుకుని బహిరంగ సభలో మాట్లాడనున్నారు. మైదానంలో వీఐపీలు, మీడియా కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళలు, కార్యకర్తలు కూర్చునేందుకు వీలుగా వేర్వేరుగా వసతి కల్పించారు.

**గులాబీమయమైన ధర్మపురి**

సీఎం కేసీఆర్ ధర్మపురికి రానున్న నేపథ్యంలో పట్టణంలోని ప్రధాన వీధులన్నీ గులాబీజెండాలతో నింపేశారు. జాతీయ రహదారి ప్రధాన కూడళ్ల వద్ద సీఎం, మంత్రుల భారీ కటౌట్లను ఏర్పాటు చేశారు.

**50 వేల మంది రాక**

సీఎం సభకు నియోజకవర్గంతోపాటు జిల్లాలోని వివిధ మండలాల నుంచి సుమారు 50వేల మందిని తరలించనున్నట్లు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు అంటున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని ఏడు మండలాల గ్రామాలకు బస్సులు, ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాలను సమకూర్చారు.

**300 మందితో బందోబస్తు**

ధర్మపురి పుణ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న సీఎం బహిరంగ సభకు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో 300 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. వీరిలో ఒక ఏఎస్పీ, ఆరుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 20 మంది ఎస్సైలు, 250 వరకు పోలీస్ కానిస్టేబుళ్లను నియమించారు.

**ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి కొప్పుల**

కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సీఎం బహిరంగ సభ ఏర్పాట్లను బుధవారం సాయంత్రం మంత్రి కొప్పుల ఈశ్వర్ పరిశీలించారు. సభకు కావాల్సిన వసతులపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

## రేపు కోరుట్లకు సీఎం రాక

కోరుట్ల: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ శుక్రవారం కోరుట్లకు రానున్నారు. పట్టణ శివారులోని మెట్‌పల్లి రోడ్ వెంట సభాస్థలికి సంబంధించిన ఏర్పాట్లు దాదాపు పూర్తి కావచ్చాయి. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ సీఎం సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# పొరపాటు జరిగితే తిప్పలే..

“ నామినేషన్లు, అఫిడవిట్ల దాఖలు సహా ఎన్నికల సంఘం నిబంధనలను పాటించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చూపినా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. రిటర్నింగ్ అధికారులకు సమర్పించే అఫిడవిట్లు అక్టోబర్ 21లోపు బీఆర్‌ఎస్ లీగల్ సెల్‌కు అందజేయాలి. వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తాం. పొరపాటు జరిగితే తిప్పలు తప్పవంటూ గత నెలలో తమ అభ్యర్థులకు సీఎం కేసీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దీంతో బీఆర్‌ఎస్ అభ్యర్థులతోపాటు, విపక్ష పార్టీలు సైతం తమ నామినేషన్, అఫిడవిట్‌ల దాఖలుకు న్యాయనిపుణుల సలహాలు తీసుకుంటున్నారు.

- రేపటి నుంచే నామినేషన్లు
- సమగ్ర సమాచారం సేకరించే పనిలో అభ్యర్థులు
- న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు
- జాతకం చూపించుకుంటున్న వైనం
- కలిసి వచ్చే తేదీన నామినేషన్ వేసేందుకు సన్నాహాలు



నామినేషన్లు వేసేందుకు హద్దులు గీస్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం రేపటి నుంచి(శుక్రవారం) మొదలుకానుంది. అభ్యర్థులు నామినేషన్ వేసుందుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థులు నామినేషన్ వేసేటప్పుడు సమర్పించాల్సిన అఫిడివిట్ తదితర అంశాల మీద ఫోకస్ చేసి, భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా ఉండేలా న్యాయనిపుణుల సలహాలతో పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకున్నారు. టికెట్లు ఖరారైన విపక్ష పార్టీల అభ్యర్థులు సైతం సమగ్ర సమాచారం సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఓవైపు ప్రచారంలో పాల్గొంటూనే మరోవైపు తమ బంధువులు, సన్నిహితుల సాయంతో న్యాయనిపుణులతో ఒకటికి రెండుసార్లు క్రాస్ చెక్ చేసుకుంటున్నారు. వ్యక్తిగత వివరాలు, తమతోపాటు తమ కుటుంబసభ్యుల పేరు మీద ఉన్న స్థిర, చరాస్తుల వివరాలను, నేరారోపణలకు సంబంధించిన అంశాలు, ట్రాఫిక్ చలాన్లు, ఫోన్, విద్యుత్ బిల్లుల బకాయిలు, ఆదాయ పన్ను రిటర్న్‌లు వంటివి జాగ్రత్తగా స్క్రుటినీ చేయించుకుంటున్నారు.

**ఆ 4 రోజుల్లోనే అధిక నామినేషన్లు..**

నామినేషన్ మంచి రోజు వేయాలని భావిస్తున్న నేతలు తమకు నమ్మకమైన పండితులను సంప్రదిస్తున్నారు. తమ పేరిట ఏరోజు నామినేషన్ వేస్తే విజయం సిద్ధిస్తుందని తెలుసుకుంటున్నారు. మరికొందరు నేతలు దోషాలు పోయేందుకు పూజలు చేస్తున్నారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, ఆయా రోజుల్లో తిథి, నక్షత్ర బలం చూయించుకుంటున్నారు. అభ్యర్థుల జాతక రీత్యా ప్రధానంగా 3, 4, 8, 9 తేదీల్లో నామినేషన్ దాఖలు చేస్తే విజయం వరిస్తుందని పండితులు సూచిస్తున్నారు. దీంతో ఈ నాలుగు రోజుల్లోనే నామినేషన్లు అధికంగా పడనున్నాయి.

**కేసుల వివరాల కోసం డీజీపీకి లేఖలు**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులపై రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో తమపై నమోదైన కేసుల వివరాల కోసం డీజీపీకి లేఖలు రాస్తున్నారు. అలాగే అభ్యర్థులు, తమ కుటుంబసభ్యుల పేరు మీద ఉన్న వాహనాలపై ట్రాఫిక్ చలాన్లు, పన్ను బకాయిలు చెల్లించి, నో డ్యూ సర్టిఫికెట్స్ తీసుకుంటున్నారు.

**ఇబ్బందులు రాకుండా డమ్మీల ఎంపిక**

ఆర్వోకు సమర్పించే నామినేషన్, అఫిడివిట్‌లలో తప్పులు, అక్షర దోషాలు, ప్రతిపాదించే అనుచరుల వివరాల్లో ఎటువంటి తప్పులు లేకుండా స్క్రుటినీ చేయిస్తున్నారు. అలాగే తమ నామినేషన్ తిరస్కరిస్తే బరిలో నిలిచేలా కుటుంబసభ్యులను డమ్మీలుగా ఎంపిక చేసుకుంటున్నారు. వారి పేరుతో సైతం నామినేషన్లు, అఫడివిట్లు తయారు చేయించే పనిలో నేతలు ఉన్నారు. అన్ని పార్టీల కంటే బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రకటన ముందే వెలువడటంతో వారు ఈ తతంగం పూర్తి చేసి, మొదటిరోజే నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. విపక్ష అభ్యర్థులు సైతం అధికార పార్టీ లీగల్ సెల్‌కు దొరకుండా ఉండేందుకు ఆయా పార్టీల అనుబంధ లీగల్ టీంలతో సంప్రదింపులు జరుపుతున్నారు.

## జిల్లాలో పోలీసు యాక్ట్ అమలు



ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో ఈనెల30 వరకు పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించబోమన్నారు.

## మెట్‌పల్లిలో బీఎస్‌ఎఫ్ జవాన్ల కవాతు



మెట్‌పల్లి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మెట్‌పల్లికి కేంద్ర బలగాలు బుధవారం చేరుకున్నాయి. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సుమారు 200మంది బీఎస్‌ఎఫ్ సిబ్బంది పట్టణంలో కవాతు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, ఏఆర్, అడిషనల్ ఎస్పీ భీంరావ్, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, బీఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్‌కుమార్, దీపాంకదేఖాతో పాటు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### సాంస్కృతిక సారథి కళాకారుడి సస్పెన్షన్

జగిత్యాల: జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు సురేశ్ నాయక్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ యాస్మిన్ బాషా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సాంస్కృతిక సారథి కళాకారులు పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనొద్దని, కానీ.. సురేశ్‌నాయక్ కోడ్‌ను ఉల్లంఘించి అక్టోబర్ 28న ఖానాపూర్ నియోజకవర్గం ఊట్నూరులో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ప్రచార సభలో పాల్గొని ప్రచారం చేశారని పేర్కొన్నారు. దీంతో అతడిని విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

### 3 నుంచి ఎంపిక పోటీలు

జగిత్యాలటౌన్: ఈనెల 3,4,6వ తేదీల్లో జిల్లాస్థాయి పాఠశాలల అండర్‌- 14, అండర్‌- 17 బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీరాం నాయక్ తెలిపారు. 3న క్రికెట్, బాడ్మింటన్, టీటీ పోటీలు, 4న బాల్ బాడ్మింటన్, టెన్నికాయిట్, 6న బాస్కెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు జగిత్యాల వివేకానంద మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్: హైదరాబాద్‌లో ఈనెల 4, 5వ తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు. బాలుర విభాగంలో కళ్యాణ్, హనుమాన్‌సాయి, తహముబీన్ మొబీన్, శౌర్య, కార్తికేయ, వశిష్ట, ముబిన్, పోహన్‌కుమార్, అనిరుద్, నీలేశ్, సాయిశ్రేయస్, జస్వంత్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో సంజన, సుధాన్వి, సహస్ర, శ్రీనయన, కీర్తన, సమీక్ష, రోహిత, స్వేతిక, సాత్విక, శరణ్య, వేదశ్రీ, అక్షర ఎంపికయ్యారు. కార్యక్రమంలో పెటా జిల్లా అధ్యక్షుడు పడాల విశ్వప్రసాద్, పీఈటీలు పడాల కృష్ణప్రసాద్, అజయ్‌బాబు, వేణు, సీనియర్ క్రీడాకారులు లక్ష్మణ్, శశి, అనిల్, విజ్ఞాన్, సామంత్, శ్రీరాం, హరీశ్ పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలులో ఇబ్బంది రానీయొద్దు



మాట్లాడుతున్న జేడీ మల్లేశం

జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు రాకుండా చూడాలని సెర్ప్ మార్కెటింగ్ అధికారి జేడీ మల్లేశం అన్నారు. జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల కొనుగోలు కేంద్రాల సిబ్బంది, కమిటీ సభ్యులకు ట్యాబ్ ఎంట్రీపై శిక్షణ ఇచ్చారు. వానకాలం సీజన్‌లో కొత్త యాప్ ద్వారా రైతు పేరు..? తెచ్చిన ధాన్యం..? తూకం వేసిన సంచులు..? ఏ ట్రక్‌లో వెళ్లింది..? ఎప్పుడు అన్‌లోడ్ అయింది..? అనే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. రైతులకు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని, రైతులు పట్టాదార్ పాస్‌బుక్, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను నిర్వాహకులకు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాల మేరకే తూకం వేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, జిల్లా సివిల్ సప్లై టెక్నీషియన్ కల్యాణ్, మండల సమైక్య అధ్యక్షురాలు సత్తవ్వ, సీసీలు గంగారాం, విద్యాసాగర్, మరియ, మంగ పాల్గొన్నారు.



# మహామహుల మంత్రపురి

- సీఎం నుంచి పీఎం దాకా ఎదిగిన పీవీ
- ఉమ్మడి ఏపీ శాసన సభాపతిగా శ్రీపాద
- రాష్ట్ర మంత్రిగా సేవలందించిన శ్రీధర్‌బాబు
- పునర్విభజనలో ముక్కలైన మంథని
- పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి పరిధిలోకి..




మంథని: మంథని అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడ్డాక 15సార్లు ఎన్నికలు జరిగాయి. ఏడు మండలాలతో కూడిన మంథనికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ప్రత్యేకత ఉండేది. జిల్లాల పునర్విభజనతో నియోజకవర్గం రెండు జిల్లాల పరిధిలోకి వెళ్లింది. మంథని, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి(కొత్త మండలం), పాలకుర్తి(కొత్త మండలం) పెద్దపల్లి, కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, మల్హర్, పలిమెల(కొత్త మండలం) జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోకి వెళ్లాయి. 2018లో తొలిసారి రెండుజిల్లాల పరిధిలోని ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

### ఓటర్లది విలక్షణమైన తీర్పు..

- ఇక్కడి ఓటర్లకు విలక్షణమైన తీర్పు ఇచ్చే ఆనవాయితీ ఆదినుంచీ కొనసాగుతోంది.
- 15సార్లు జరిగిన ఎన్నికల్లో 11సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు.
- అంతేకాదు.. ఒక్కసారే బీసీ నేతను ఎమ్మెల్యేగా గెలిపించారు.
- రెండుసార్లు రెడ్డి, మిగతా 12సార్లు బ్రాహ్మణులను పాలకులుగా ఎన్నుకున్న చరిత్ర ఇక్కడి ఓటర్లకు ఉంది.
- 1952లో సోషలిస్టు పార్టీ అభ్యర్థి గులికోట శ్రీరాములు, 1994లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి
- చందుపట్ల రాంరెడ్డి, 2014లో టీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధు కాంగ్రెస్ పార్టీని ఓడించి రికార్డు సాధించారు.
- మిగతా 11 పర్యాయాలు కాంగ్రెస్ అభ్యర్థులు సునాయాసంగా విజయం సాధించి మంథని తమ పార్టీ కంచుకోటగా మార్చుకున్నారు.
- 1983లో ఎన్టీఆర్ టీడీపీ ప్రభంజనంలోనూ మంథని ఓటర్లు ప్రలోభాలకు లోనుకాకుండా, సినీ గ్లామర్‌ను లెక్కచేయకుండా విలక్షణమైన తీర్పు ఇచ్చారు.

### సీఎంగా పీవీ, స్పీకర్‌గా శ్రీపాద..

- దేశప్రధానిగా సేవలు అందించిన పీవీ నరసింహారావుకు రాజకీయ ఓనమాలు నేర్పిన నియోజకవర్గం మంథని. 1957 నుంచి 1972వరకు నాలుగు పర్యాయాలు మంథని ఎమ్మెల్యేగా విజయం సాధించారు. మంత్రివర్గంలో కీలక పదవులు అధిష్ఠించారు. చివరకు సీఎం పీఠం కూడా అధిష్ఠించారు. ఇ1983 నుంచి 1999వరకు జరిగిన మూడు ఎన్నికల్లోనూ దుద్దిళ్ల శ్రీపాదరావుకు పట్టంకట్టి శాసనసభకు మంచి శాసన సభాపతిని అందించిన ఘనత మంథని ఓటర్లదే. రాజకీయ అజ్ఞానం మంథని ఓటర్ల సొంతమన్న అభిప్రాయం అప్పట్లో ఉన్నా.. వీరు అందించిన నేతలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం తమ ఓటర్ల అదృష్టంగా భావిస్తున్నారు. నక్సల్స్ చేతిలో హతమైన శ్రీపాదరావు తర్వాత రాజకీయ అరంగ్రేటం చేసిన
- ఆయన తనయుడు శ్రీధర్‌బాబు.. 1999, 2004, 2009లో జరిగిన ఎన్నికల్లో వరుస విజయాలు నమోదు చేసుకున్నారు. 2018లోనూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంథని నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి రాజకీయ ప్రత్యేకతకు చోటుకల్పించారు.



పీవీ నరసింహారావు



శ్రీపాదరావు



శ్రీధర్‌బాబు



పుట్ట మధు

### ఎన్నికలపై కుల ప్రభావం..

- నియోజకవర్గంలో 2,30,387మంది ఓటర్లు ఉండగా, అత్యధికంగా 29,339మంది మాదిగ, 28,433మంది పద్మశాలీ, 25,944మంది మున్నూరుకాపు సామాజిక వర్గాలు ఉన్నాయి.
- మంథని నుంచి అసెంబ్లీ బరిలో ఉండేందుకు ఆసక్తి చూపుతున్న పుట్ట మధు, కర్రు నాగయ్య మున్నూరుకాపు సామాజికవర్గానికి చెందిన వారే.
- అలాగే మాల కులస్తులు 23,465 మంది, గౌడ సామాజికవర్గం కులస్తులు 20వేల పైచిలుకు ఉన్నారు.
- మొత్తంమీద బీసీల ఆధిపత్యమే కనిపిస్తోంది.

### ఆధ్యాత్మిక క్షేత్రం..

- మంథని నియోజకవర్గం ఆధ్యాత్మిక క్షేత్రం. దక్షిణ కాశీగా పేరొందిన కాళేశ్వర క్షేత్రం ప్రాచీన చరిత్రకు నిలువుటద్దం. మంత్రపురి వేదాలకు పుట్టినిల్లు. వేయి ఏళ్లకుపైగా మహోన్నత చరిత్ర కలిగిన మంథని ఆలయాలకు నిలయమై టెంపుల్ టౌన్‌గా ప్రసిద్ధికెక్కింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా వినాయకుని గుడి, దక్షిణభారతదేశంలో ఏకైక పశ్చిమముఖ శివలింగం ఇక్కడే దర్శనమిస్తాయి. అన్ని దేవతల ఆలయాలు ఇక్కడ ఉన్నాయి.

### ఇంటికో ఇంజినీర్.. వీధికో డాక్టర్..

- మంథని నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో అమెరికాతోపాటు ప్రపంచంలోని అన్నిదేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగాలకు వలస వెళ్లి స్థిరపడినవారు ఉన్నారు. ఇక్కడ వందలాది మంది వైద్యులు, ఇంజినీర్లు ఉన్నారు.

## బీఆర్‌ఎస్ గెలుపులో దివ్యాంగులదే ప్రధాన పాత్ర

- ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



వాసుదేవరెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: బీఆర్‌ఎస్ గెలుపులో దివ్యాంగులదే ప్రధానపాత్ర అని ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పద్మనాయక కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి దివ్యాంగుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ 77 ఏళ్ల పాలించి పైసా ఇవ్వలేదని, తులం బంగారం ఇస్తామంటే నమ్ముతారా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా దివ్యాంగులకు రూ.4 వేల పెన్షన్ ఇస్తున్నది సీఎం కేసీఆర్ అని చెప్పారు. జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, దివ్యాంగులకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. రాష్ట్ర వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, దివ్యాంగుల బతుకులు మార్చినది సీఎం కేసీఆర్ అని, సంజయ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, సత్యనారాయణ, శ్రీధర్, గంగాధర్ పాల్గొన్నారు. కాగా పట్టణంలోని 38వ వార్డులో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే సంజయ్ కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు లక్ష్మీనారాయణ, భూమరాజం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**గడప గడపకూ సంక్షేమ పథకాలు**

రాయికల్(జగిత్యాల): సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని భూపతిపూర్‌కు చెందిన 70 మంది బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు కోల శ్రీనివాస్, సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలను వివరించాలి**

సారంగాపూర్(జగిత్యాల): బీఆర్‌ఎస్ అమలు చేసిన, రాబోయే రోజుల్లో అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంతలు అన్నారు. బుధవారం బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో బూత్‌కమిటీలు, వివిధ కార్యవర్గాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతీ ఇంటికి వివరించాలని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ మంత్రి రాజేశంగౌడ్, కేడీసీసీ బ్యాంక్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, కొల్ముల రమణ, నారపాక రమేశ్, నల్ల మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మీ కష్టసుఖాల్లో పాలుపంచుకున్నా..

- కాంగ్రెస్ ధర్మపురి అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్



ప్రచారంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి(ధర్మపురి): 'స్థానికేతరుడినైనా మీ బిడ్డగా మీ ముందుకు వచ్చాను, మీ కష్టసుఖాల్లో పాలుపంచుకున్నా, ఈ ఎన్నికల్లో అండగా నిలిచి ఆశీర్వదించాలని కాంగ్రెస్ ధర్మపురి అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. మండలంలోని లొత్తునూర్, బొంకూర్, ఇబ్రాజీపల్లి, రాపల్లి గ్రామాల్లో బుధవారం రాత్రి గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి 400 పైగా పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌తో విసుగుచెందిన ప్రజలు కాంగ్రెస్‌లోకి వలసలుగా వస్తున్నారన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో అర్హులైన పేదలను వదిలేసి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులకు పథకాలను కట్టబెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు నిషాంత్‌రెడ్డి, సర్పంచులు సత్యనారాయణ, చిర్ర గంగాధర్, వెంకటపద్మ, రాజ్యలక్ష్మి, తిరుపతిరెడ్డి, నాయకులు తాడూరి సత్యనారాయణ, వెంకటేశ్‌గౌడ్, రమాగౌడ్, కాసారపు అరవింద్‌గౌడ్, నేరెళ్ల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మూఢనమ్మకాలను వీడాలి



అవగాహన కల్పిస్తున్న నరేశ్

గొల్లపల్లి(ధర్మపురి): విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి విద్యార్థి దశ పునాది అని భారత నాస్తిక సమాజం రాష్ట్ర నాయకుడు ఉప్పులేటి నరేశ్ అన్నారు. మండలంలోని చిల్వాకోడూర్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం లక్ష్మీబాయి అధ్యక్షతన మహిళల రక్షణ–మూఢనమ్మకాల నిర్మూలన అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలు వీడుతూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. దయ్యాలు, భూతాలు, మంత్రాలు బూటకమని, సైన్స్‌ను సైనికుల్లా విద్యార్థులు ముందుకు నడపాలన్నారు. ఈ సందర్భంగా సైన్స్‌మ్యాజిక్ ప్రదర్శనలు చేశారు.

## బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్లరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 200 మంది బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. కోరుట్ల నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. ఈ నెల 3న సీఎం కేసీఆర్ కోరుట్లకు వస్తున్నారని, ప్రజలు భారీ సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచ్ సరికెల్ల మల్లారెడ్డి, యాదవ, గంగపుత్ర, పెరుక, గౌడ, కుమ్మరి, వడ్డెర, గోసంగి, మ్యాదరి సంఘాల సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సంక్షేమం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సంక్షేమం అందుతుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయికల్ పట్టణంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ సమక్షంలో రాయికల్ మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ మొబిన్‌తో పాటు సుమారు 200 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, కాంగ్రెస్ గెలుపునకు ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోపి మాధవి, కౌన్సిలర్ మ్యాకల అనురాధ, పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, యూత్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎద్దండి సింధూజ పాల్గొన్నారు.

**స్థానికంగా ఉంటూ ప్రజలకు సేవ చేస్తా**

జగిత్యాలరూరల్: తన రాజకీయ జీవితం ప్రజలకు అంకితమని, స్థానికంగా ఉంటూ ప్రజలకు సేవ చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాల అర్బన్ మండలం పెర్కపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. కాగా జగిత్యాల కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జీవన్‌రెడ్డికి ఎన్నికల ఖర్చు నిమిత్తం జగిత్యాల రూరల్ మండలం పొరండ్లకు చెందిన చిన్నారి బేతి జెస్సికరెడ్డి రూ.5 వేల నగదు అందజేసింది.

**జగిత్యాల పట్టణాభివృద్ధికి బాటలు వేశా**

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణాభివృద్ధికి బాటలు వేసింది తానేనని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం జగిత్యాల మినీస్టేడియంలో వాకింగ్ చేస్తూ, బాస్కెట్‌బాల్ ఆడుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనకు ఓటు వేసి గెలిపించాలని వాకర్స్, విశ్రాంత ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులను అభ్యర్థించారు. ఎన్నికల్లో ఓడినా, గెలిచినా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తున్నానని, కాంగ్రెస్ ఆదరించి చేతి గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

## ధర్మపురి వాసులకు డాక్టరేట్



గొల్లపెల్లి గణేశ్



సంగి రమేశ్



ప్రకాశ్



సంగనభట్ల దివ్య



గోలి శ్రీలత

ధర్మపురి: వివిధ అంశాలపై పరిశోధనలు చేసిన ధర్మపురి వాసులు డాక్టరేట్ పట్టాలు పొందారు. స్నాతకోత్సవంలో భాగంగా హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం లో గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా పట్టాలు అందుకున్నారు. ఉపకులపతి ప్రొఫెసర్ రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి అమెరికాకు చెందిన అడోబ్ సంస్థ ముఖ్య కార్యనిర్వాహక అధికారి శంతన్‌నారాయణ్ హాజరై పట్టాలు అందజేశారు.

**గొల్లపెల్లి గణేశ్ (ధర్మపురి)**

అంశం: అంతర్జాలంలో తెలుగు అంశంపై పరిశోధనలు చేశారు. ప్రస్తుతం ధర్మపురి మండలం కమలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

**సంగి రమేశ్ (ధర్మపురి)**

అంశం: తెలంగాణ సామెతలు– భాషా, సంస్కృతిక అధ్యయనంపై పరిశోధన చేశారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

**ప్రకాశ్, (నాగారం, ధర్మపురి)**

అంశం: శైలీ శాస్త్రం దళిత కవిత్వంపై పరిశోధనలు చేశారు. ప్రస్తుతం కరీంనగర్ ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

**గోలి శ్రీలత (ధర్మపురి)**

అంశం: తెలుగు అకార గ్రంథాలు– నిర్మాణ పద్ధతులపై పరిశోధనలు చేశారు. ప్రస్తుతం మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

**సంగనభట్ల దివ్య (ధర్మపురి)**

అంశం: ఫార్మాసీ అంశంపై పరిశోధనలు చేశారు. ప్రస్తుతం పరిశోధనలు చేయడం కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ)వారు రూ. 31 లక్షలు మంజూరు చేశారు.

### శరత్‌చంద్రకు..



డాక్టరేట్ స్వీకరిస్తున్న శరత్‌చంద్ర

కోరుట్లటౌన్: పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన తిరునగరి శరత్‌చంద్ర డాక్టరేట్ పట్టా స్వీకరించారు. 2017లో ఆచార్య సూర్యాధనుంజయ్ పర్యవేక్షణలో దాశరథి సినిమా పాటల్లో కవితాత్మకత అంశంపై పీహెచ్‌డీ ప్రారంభించి 2022లో పూర్తి చేశాడు. బాసర ట్రిపుల్ ఐటీలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు..

### నగదు పట్టివేత

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): ఆధారాలు లేని నగదును పట్టుకున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. బుధవారం మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయం సమీపంలోని అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా కారులో తరలిస్తున్న రూ.1 లక్షా 45 వేలు, ఓ ద్విచక్ర వాహనదారుడి వద్ద రూ.1 లక్షా 50 వేల నగదు పట్టుబడిందని, ఆ మొత్తాన్ని జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు పేర్కొన్నారు.

**వెల్గటూర్‌లో..**

వెల్గటూర్(ధర్మపురి): ఎన్నికల విధుల్లో భాగంగా వెల్గటూర్ పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీలో నగదు పట్టుబడినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. పైడిపెల్లి ఎక్స్‌రోడ్డు వద్ద తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.1 లక్షా 75 వేల నగదు, రూ.92 వేలు విలువ చేసే ప్లాస్టిక్ డ్రంబులు సీజ్ చేసి ఎన్నికల అధికారికి అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



గంగూబాయి(ఫైల్)

కోరుట్లరూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామ మాజీ సర్పంచ్ పల్లి గంగూబాయి(55) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. కొంతకాలంగా ఆమె క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. 2001 నుంచి 2006 వరకు సర్పంచ్‌గా కొనసాగారు. గంగూబాయి మృతి పట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాంగౌడ్, ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేశ్‌గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు.

### తాట్లవాయిలో మాజీ ఎంపీటీసీ..



సాయిలు (ఫైల్)

రాయికల్(జగిత్యాల): మండలంలోని తాట్లవాయి గ్రామ మాజీ ఎంపీటీసీ పాలెపు సాయిలు (64) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. 2003 నుంచి 2008 సంవత్సరం వరకు ఎంపీటీసీగా కొనసాగారు. ఆయన మృతిపట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, సర్పంచ్ రాగి సాగరిక, ఉపసర్పంచ్ మల్లేశ్, దళిత సంఘ నాయకుడు ఈదుల లక్ష్మణ్ సంతాపం వ్యక్తం చేశారు.

### విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం



గంగారెడ్డి(ఫైల్)

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం తాళ్ళధర్మారంలో బుధవారం విద్యుదాఘాతంతో రైతు ముస్కు గంగారెడ్డి(42) మృతిచెందాడు. ఏఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. గంగారెడ్డి తనకున్న ఎకరంన్నర పొలంలో, మరికొంత భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. సొంత పొలంలో వరికి నీరు పెట్టేందుకు ఉదయం 11గంటలకు ఇంటి నుంచి బయలుదేరాడు. మధ్యాహ్నం 2 గంటల వరకు గంగారెడ్డి ఇంటికి రాకపోవడంతో భార్య శ్యామల, గ్రామస్తులతో కలిసి పొలం వద్దకు వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. అయితే విద్యుత్ మోటారు నడుస్తున్న క్రమంలో ఇనుపపైపునకు ప్లాస్టిక్‌పైపును జాయింట్ చేస్తుండగా విద్యుత్ ప్రసారం కావడంతో గంగారెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. గంగారెడ్డికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు.

### రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..

కోరుట్లరూరల్: మండలంలోని మోహన్‌రావుపేట గ్రామంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన తుపాకుల చిన్న నర్సయ్య (65) మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. చిన్న నర్సయ్య తన ద్విచక్ర వాహనంపై వల్లంపెల్లి క్రాసింగ్ వద్ద రోడ్డు దాటుతుండగా జగిత్యాల వైపునుంచి వస్తున్న ప్రైవేటు బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్న నర్సయ్య తలకు తీవ్ర గాయాలు కాగా అంబులెన్సులో జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడి భార్య గంగు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఇద్దరికి తీవ్ర గాయాలు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని తాండ్ర్యాల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్తులు వివరాల ప్రకారం.. తాండ్ర్యాలకు చెందిన బాదనకుర్తి దేవక్క కుటుంబసభ్యులతో కలిసి రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం నాంపెల్లిలో ఓ శుభ కార్యక్రమానికి బుధవారం ఉదయం ఆటోలో వెళ్లి రాత్రి తిరిగి వస్తుండగా, తాండ్ర్యాల శివారులో ఎదురుగా వస్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దేవక్క, కండ్లి రాజవ్వకు తీవ్రగాయాలు కాగా, కోరుట్లలోని ఆసుపత్రికి తరలించారు. అదే గ్రామానికి చెందిన కండ్లి రజని, కండ్లి పోచయ్యకు స్వల్పగాయాలు కావడంతో గ్రామంలో ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించారు. ఘటన స్థలాన్ని ఎస్సై కిరణ్‌కుమార్ పరిశీలించారు.

### గుర్తు తెలియని మృతదేహం

ధర్మపురి: మండలంలోని ఆరెపల్లి గోదావరిలో బుధవారం గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై దత్తాత్రి తెలిపారు. పోస్టుమార్టం కోసం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.